## నీ శక్తి నీకు తెలుసా?

**మద్దూరి రాజ్యశ్రీ**

ఒక పాష్ కాలనీలో పని చేయటానికి ఒక పనివాళ్ళ అసోసియేషన్ ఉంది. దాని లీడర్ అప్పల నరసమ్మ చాలా తెలివైనది. ఒక్కచూపులో ఏ ఇంటి యిల్లాలు మనస్థత్వం ఏమిటో ఇట్టే పట్టేస్తుంది. వాళ్ళకి తగ్గట్టుగా తన దగ్గర ఉన్న పనివాళ్ళని జత చేస్తుంది.

ఒక ఇంట్లో విజయ అనే ఇల్లాలు ఉంది. ఆవిడ పెద్ద ఆఫీసులో పెద్ద పొజిషన్‌లో ఉంది. బొత్తిగా అంట్లు తోమడం, బట్టలు ఉతకటం లాంటి పనులంటే భయం. అందుకే అందరికన్నా ఎక్కువ డబ్బులు ఇచ్చి మరీ పనిమనిషిని పెట్టుకుంది. దానిపేరు లక్ష్మమ్మ. దాన్ని అప్పలనరసమ్మే కుదిర్చింది. దానికి ముందే కొన్ని జాగ్రత్తలు చెప్పింది నరసమ్మ! 'ఏ ఇంట్లో అయినా దుమ్మాలు కొట్టుకాని, ఎంత కష్టం వచ్చినా విజయమ్మ ఇంట్లో మాత్రం కొట్టకు. ఒకవేళ నాగాలు పెట్టి తీరాల్సిన పరిస్థితే వస్తే ఒక్కరోజుకన్నా ఎక్కువ మానకు.'

లక్ష్మమ్మ మీద ఆ మాట కొన్ని నెలలే పనిచేసింది. అలవాటైన ప్రాణం ఎక్కడికి పోతుంది? చెప్పాపెట్టకుండా వారం రోజులు దుమ్మా కొట్టేసింది. అది రాగానే విజయ పనిలోంచి పీకేసింది. అప్పుడు లబోదిబోమంటే అప్పల నరసమ్మ కూడా లక్ష్మమ్మనే తిట్టింది. 'నేను చెపితే వినలేదు నువ్వు' అంటూ!

ఇంతకీ అసలు విషయం విజయకి ముందే చెప్పినట్టుగా అంట్లు తోముకోవడం, బట్టలు ఉతకడం అంటే చాలా కష్టమైన పని అన్న భావన ఉండేది. ఎప్పుడైతే వారం రోజులు తోముకోవాల్సి వచ్చిందో, ఓస్ ఇంతేనా? దీనికేనా ఇంత భయపడ్డాను అనుకుంది. అలా ఆవిడలో అంతర్లీనంగా శక్తి ఉంది. అది బయటకి వస్తే లక్ష్మమ్మ ఉద్యోగానికి ముప్పు అని అప్పల నరసమ్మ గ్రహించింది.

అలా మన శక్తి మనకే తెలియదు. మనలో ఉన్న దేముడి గురించి అసలు తెలియదు సరే, మనలో ఉన్న శక్తే తెలియదు.

## అలజడి చెందిన అల

**మద్దూరి రాజ్యశ్రీ**

అది ఒక అందమైన సాయంకాలం. బీచ్ ఒడ్డున పిల్లలు, పెద్దలూ కేరింతలు కొడుతూ నీళ్ళలో ఆడుతున్నారు. కొంతమంది బంతి తెచ్చుకుని నీళ్ళలో నిల్చుని పట్టుకుని ఆడుతున్నారు. ఇదేంటబ్బా అచ్చం నాలా ఉందని కుతూహలంగా ఆకాశంలోంచి నీళ్ళలోకి దిగుతూ చూస్తున్నాడు సూర్యుడు. నీలంగా ఉన్న ఆకాశం ఎర్రరంగులోకి మారటం చూసి, ఖంగారుపడుతున్నారు మరీ చిన్నపిల్లలు! మీ ఉత్సాహం ఎక్కువా, మా ఉత్సాహం ఎక్కువా అని వాళ్ళతో పోటీలు పడుతూ అలలు వాళ్ళమీదకి దూసుకువస్తున్నాయి.

'డాడీ! అటు చూడు! అలలు నేను ఫస్టంటే నేను ఫస్టని రన్నింగ్ రేస్ పెట్టుకున్నట్టు లేవూ?' అంటాడొక పిల్లాడు.

మిగతా పిల్లలందరూ ఆ అల పెద్దగా లేచింది, అది మన కాళ్ళదాకా వస్తుంది అని ఒకరూ, కాదు ఈ అల వస్తుందని ఒకరూ పోటీలు పడటం మొదలెట్టారు.

ఈ సంబరం అంతా చూస్తూ తను కూడా వాళ్ళతో పాటు పంచుకోవాలని ఒక చిన్న కెరటం లేచింది. ఎంత ఎత్తుకి ఎదిగినా గట్టిగా నాలుగు అడుగులు సాగకుండానే అలసిపోతోంది. మళ్ళీ మళ్ళీ ప్రయత్నం చేస్తోంది కాని ఊహూ! లాభం లేదు. ఎంతో పైకి ఎదిగిన అలని చూసి, 'నాకు నిన్ను చూస్తే ఈర్ష్యగా ఉంది. నీ అంత ఎత్తుకి నేను ఎప్పటికి ఎదగగలనూ?' అంది. ఆ పెద్ద కెరటం చూసి, చిరునవ్వు నవ్వి, "పిచ్చిదానా అలా ! నా మీద ఈర్ష్య ఎందుకు? నువ్వూ, నేనూ వేరు వేరు అయితే కదా ఈర్ష్య పడాలి. మనం ఇద్దరం ఇక్కడే పుట్టాం. ఇక్కడే ఉంటాం. ఈ గిరిదాటి బయటకు పోలేం. నేనేదో కాస్త దూరం వెళితే వెళ్ళొచ్చు కాని, మళ్ళీ తిరిగి నీతోనే వెనక్కి వస్తున్నా కదా! మన అల ఆకారం పక్కకి పెడితే, మనం ఇద్దరం ఆకారం లేని నీరు మాత్రమే' అంది.

మనమూ అంతే కదా! మన శరీరాకారం పక్కన పెడితే అందరం ఒక్క వస్తువులోంచి వచ్చినవాళ్ళమే కదా! ఎప్పుడైతే ఆకారం వచ్చిందో అప్పుడు పొట్టి, పొడుగు, లావు, అందం, వికారం మాటలు వచ్చాయి. అది తీసేసి చూస్తే మనలో ఆత్మ ఒకటే!

## మిడిసిపాటు ఎందుకు?

**మద్దూరి రాజ్యశ్రీ**

'మానవుడే మహనీయుడు' అన్న పాటలో మానవుడు సాధించిన ఎన్నో విషయాలు వస్తాయి. అది విన్న ఒక రామయ్య మనిషీ, దేవుడూ ఒకటే అన్న నిశ్చయానికి వచ్చేశాడు. పైగా తరచు వినే 'అహం బ్రహ్మాస్మి' అనే మాట అతని ఆలోచనకి బలం ఇచ్చింది. నేనే బ్రహ్మని అనుకున్నాడు.

దేవుడు సృష్టి చేస్తే మనిషి ప్రతిసృష్టి చేశాడు. దేవుడు గ్రహాలని, ఉపగ్రహాలని సృష్టిస్తే, మనిషి ఆర్టిఫిషియల్ శాటిలైట్లని సృష్టించాడు. దేవుడు మనిషిని సృష్టిస్తే, మనిషి ఆ దేవుడికి ఒక ఆకారం ఇచ్చి, ఆలయాలు కట్టి, పూజలు మొదలెట్టాడు. దేవుడు సముద్రాన్ని సృష్టిస్తే, మనిషి ఆర్టిఫిషియల్ సముద్రాన్ని సృష్టించి వాటర్ కింగ్‌డమ్‌లు తయారుచేశాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! అందుకని దేవునితోనే సవాలు చేస్తాడు.

'ఓ దేవా! నువ్వు, నేనూ ఒకటే! నువ్వేం తయారుచేస్తే నేనూ అది తయారుచేస్తాను. చూడు కావాలంటే!' అంటాడు.

దేవుడు ఇతని సంగతేమిటో చూద్దామని ప్రత్యక్షమవుతాడు. 'సరే' అంటే 'సరే' అనుకుంటారు ఇద్దరూ.

అతను మట్టిని చేతిలో తీసుకుని, 'ఊ! ఏం చెయ్యమంటావ్?' అంటాడు.

దేవుడు, 'ముందు నీ చేతిలో ఉన్న మట్టి తయారుచెయ్యి! అది నేను చేసిందే!' అంటాడు.

అప్పుడు అతనికి నోట మాట రాలేదు. అదే మనిషికీ, దేవుడికీ తేడా! మనిషి ఒక వాచీ చేసాడంటే వాచీ వేరు, మనిషి వేరు. దానికి వాడిన ముడిసరుకులు వేరు. దేవుడు తయారుచేస్తే అలా కాదు. తన నుంచే తయారుచేస్తాడు. ముడిసరుకులు తన నుంచి వచ్చినవే! ఆ వస్తువైె తనలోని భాగమే!

అంటే మనిషి విషయంలోకొస్తే, మూడు భిన్న వస్తువులు – మనిషి, ముడిపదార్థం, పరికరం. అదే దేవుడి విషయంలో ఆ మూడూ ఒకటే! ఇది అర్థం చేసుకుంటే ఈ మిడిసిపాటు ఉండదు!

## అన్నదమ్ముల అనురాగం

**మద్దూరి రాజ్యశ్రీ**

శ్రీరామచంద్రుడు సీతా, లక్ష్మణులతో కలిసి చిత్రకూట పర్వత సమీపానికి వచ్చాడు. అక్కడ నడుస్తూండగా రాములవారి పాదంలో ఒక ముల్లు కసుక్కున దిగింది. వెంటనే రాములవారు ఒంగి భూమాతకు రెండుచేతులూ జోడించి, 'అమ్మా! ఈ ముల్లు నన్ను గుచ్చుకున్నా ఫర్వాలేదు. కాని రేపెప్పుడో భరతుడు నన్ను వెతుక్కుంటూ ఈ మార్గంలో వచ్చినప్పుడు, దయచేసి నీ ముళ్ళని దాచేసి, నీ మార్గం సుగమంగా చేయి. లేకపోతే భరతుడు బాధపడతాడు' అన్నాడు.

భూమాత ఆశ్చర్యంగా, 'ఎందుకలా అడిగావు? ఏం, మీ భరతుడు అంత సుకుమారా? ఆ మాత్రం నెప్పి తట్టుకోలేడా? సుఖదుఃఖాలకు అతీతుడు కాడా? అతనొక యోగి అని విన్నానే?' అంటుంది.

రాముడు సమాధానంగా, 'ఈ ముల్లు అతని కాలుని గుచ్చుకోదు. హృదయాన్ని గుచ్చుకుంటుంది' అంటాడు.

'అదెలా?' ఆశ్చర్యంగా అడుగుతుంది భూమాత.

'ఒక ముల్లు గుచ్చుకున్నంత మాత్రాన అతనేం బాధపడడు.కాని నా గురించి తలచుకుని చాలా దిగులు చెందుతాడు. అయ్యో! మా అన్నగారు ఇటు నడిచి ఉంటారే! అప్పుడు ఈ ముల్లు గుచ్చుకుని ఆయన్ని ఎంత బాధపెట్టి ఉంటుందో కదా! అలా దోవ పొడుగుతూ ఇంకెన్ని ముళ్ళు, రాళ్ళు,రప్పలు గుచ్చుకుని ఉంటాయో కదా అని చాలా బాధపడతాడు. అతనలా బాధపడితే నేను తట్టుకోలేను. అందుకని నా మాట మన్నించి అతనిటుకేసి వచ్చినప్పుడు మెత్తని గులాబీల తివాచీ పరచినట్లు చేయి తల్లీ! ఇంకేం కోరను నిన్ను' అంటాడు.

అదీ అన్నదమ్ముల అనురాగం అంటే!

## మేలిమి బంగారం

**మద్దూరి రాజ్యశ్రీ**

ఒక స్వామీజీ దగ్గర ఒక శిష్యుడు ఉండేవాడు. ఈ స్వామీజీ ఏ ఆర్భాటమూ లేకుండా సాదాసీదాగా ఉండటం ఆ శిష్యుడికి నచ్చేది కాదు. 'మీరు ఎంత స్వామీజీ అయితే మాత్రం కాస్త హంగూ, ఆర్భాటంగా ఉండొచ్చు కదా! అప్పుడు మన దగ్గరకి ఇంకా విదేశీయులు కూడా వస్తారు కదా!' అని గోల పెట్టేవాడు.

ఒకరోజు ఆ స్వామీజీ తన చేతికున్న, మట్టికొట్టుకుపోయినట్టున్న ఉంగరం తీసిచ్చి, 'ఈ ఉంగరం బజారుకు తీసుకెళ్ళి వెయ్యిరూపాయలకి అమ్మిరా!' అన్నాడు. ఉంగరం వాలకం చూస్తే వెయ్యి రూపాయల మాట దేవుడెరుగు, పది రూపాయలు కూడా వచ్చేటట్టు లేదు. కొంచెం నసుగుతూ, 'అంత రాదేమోనండి' అన్నాడు. 'నీకెందుకు ఆ తంటా! పోయి అడిగిరా' అన్నాడు స్వామీజీ. పాపం శిష్యుడు బజారులో ఉన్న అన్ని షాపుల్లోనూ అడిగాడు. కిరాణా షాపు, మందుల దుకాణం, పూల అంగడి, బట్టల దుకాణం ఒకటేమిటి అన్నీ! అందరూ అతన్ని చూసి గేలి చేసినవారే తప్ప ఎవరూ కొంటాం అనలేదు.

ఖిన్నవదనంతో స్వామి దగ్గరకి వెళ్ళి చెప్తే, 'పోనీలే బాధపడకు. ఇప్పుడు పక్కవీధిలో ఉన్న బంగారునగల దుకాణానికెళ్ళి అడిగి చూడు. ఇంత కావాలి అని నువ్వేం చెప్పకు. ఎంతకు కొంటావు అని అడుగు చాలు!' అన్నాడు.

ఆ బంగారు దుకాణం అతని కళ్ళు ఈ ఉంగరాన్ని చూడగానే మెరిశాయి. వెయ్యి రూపాయలిస్తానన్నాడు. శిష్యుడు ఉత్సాహంగా పోయి స్వామికి చెప్పాడు.

'చూసావా శిష్యా! నీ ప్రశ్నకి ఇదే జవాబు. పై పై మెరుగులు చూసి మోసపోకూడదు. బజారులో వాళ్ళు ఉంగరం పాతగా ఉండటంతో దానికి విలువ లేదనుకున్నారు. బంగారు వర్తకుడికే అది మేలిమి బంగారం అని తెలిసింది. అలాగే బంగారం లాంటి మనసున్న వాడికే ఎదుటి వాడిలోని ప్రతిభ కనపడుతుంది. అలాంటి వాడికి మనం ఏ ప్రలోభాలూ చూపనక్ఖరలేదు' అన్నాడు స్వామి.

## డబ్బుతో కొనలేనిది!

**మద్దూరి రాజ్యశ్రీ**

ఒక గురువు గారికి ఎనిమిది మంది శిష్యులున్నారుట. ఒక రోజు ఆయన తను చెప్పిన పాఠాలని అందరినీ తన పుస్తకంలోంచి రాసుకోమన్నారు. అందులో ఒకతను పూర్వాశ్రమంలో బద్ధకస్తుడు. ఆ ఛాయలు ఇంకా పోలేదు. అందుకని ఇంకో శిష్యుడిని బ్రతిమాలాడు. 'నాకు కూడా నువ్వే రాసిపెట్టు. నీకు కావాల్సిన డబ్బు ఇస్తాను' అని– ఏమనుకున్నాడో ఏమో ఆ శిష్యుడు రాసిపెట్టాడు.

ఒకరోజు వాళ్ళ పుస్తకాలు తనిఖీ చేస్తుంటే గురువు గారికి రెండు పుస్తకాల్లో ఒకటే చేతివ్రాత కనబడింది. ఇదేమిటని నిలదీస్తే తోడుదొంగలిద్దరూ తమ తప్పు ఒప్పుకున్నారు. రాసిపెట్టిన శిష్యుడిని

మందలించి వదిలేశారు.

రాయించుకున్న శిష్యుడిని మాత్రం తన శిష్యరికం నుంచి తొలగించేశారు. 'నువ్వు నిజం ఒప్పుకున్నందుకు సంతోషంగా ఉన్నా, నీ తప్పిదాన్ని మన్నించి, నిన్ను శిష్యునిగా స్వీకరించలేను. ఆధ్యాత్మిక ప్రపంచంలో షార్ట్‌కట్స్ ఉండవు. నీకు తోడు ఎవరూ రారు. నీ మోక్షానికి నువ్వే పాటు పడాలి. ముఖ్యంగా ఈ మార్గంలో కావాల్సింది శ్రద్ధ, చిత్తశుద్ధి! ఇవేవీ అక్కరలేదు. ఈ రోజుల్లో డబ్బుతో కొనలేనివి ఏవీ లేవంటావేమో! ఉన్నాయేమో నాకు తెలియదు. ఇక్కడ మాత్రం సాగదు అది. ఇంకెక్కడన్నా అలా అమ్మేవాళ్ళున్నారేమో వెతుక్కో!' అని చివాట్లేసి పంపేశారు.

తన శిష్యుడు శ్రద్ధగా తను రాసిన పుస్తకం లోంచి రాసుకోవటం, అది తనకి కష్టమైనా దానిని కష్టంగా భావించకపోవటం గమనించిన రమణ మహర్షి శ్రద్ధ గురించి చెప్పిన కథ ఇది.

## పసిపాపలాంటి పెన్సిలు

**మద్దూరి రాజ్యశ్రీ**

'నాన్నా! తమ్ముడు పెన్సిల్‌తో ఎందుకు రాస్తున్నాడు? పెన్నుతో ఎందుకు రాయటం లేదు?'

'పెన్సిలుకో కథ ఉందిరా కన్నా! పెన్సిలుని తయారుచేసినప్పుడు దేవుడు నీ మీద ఐదు భారాలు వేస్తున్నాను' అన్నాడు.

'ఏమిటి స్వామీ!' అంది పెన్సిలు.

'మొదటిది నువ్వు ఎవరి చేతుల్లో పట్టుకుంటే, వారి చేతుల్లో ఇమిడిపోయేందుకు వీలుగా ఉండాలి. రెండు- వాళ్ళు నీ చేత ఏది రాయిస్తే అది రాయాలి. మూడు- నిన్ను వాళ్ళు చెక్కుతూ ఉంటారు. దానికి నువ్వు సిద్ధంగా ఉండాలి. నాలుగు- నువ్వు దేనిమీద రాసినా ఆ రాత స్పష్టంగా కనపడేలా అందరికీ అర్థమయ్యేలా ఉండాలి. ఐదు- అతి ముఖ్యమైనది – నీ లోపల భాగం చక్కగా ఉండాలి. లేకపోతే ముట్టుకుంటే విరిగిపోతావు' అన్నాడు.

'అలాగే స్వామీ! కానీ నాదొక చిన్న విన్నపం. నన్ను పట్టుకునే వాళ్ళకి మంచి లక్షణం ఉండేలా చేయి స్వామీ! లేకపోతే నన్ను నాశనం చేసేస్తారు' అంది.

'నువ్వేం బెంగపడకు. ఈ ఐదు లక్షణాలూ ఉన్న పసిపాపలే నిన్ను ఎక్కువ వాడేలా చేస్తాను. వారు మట్టిముద్దలాగా పెద్దల చేతుల్లో ఇమిడిపోతారు. రెండు- వాళ్ళు ఏది నేర్పిస్తే అది మంత్రముగ్ధల్లా నేర్చుకుంటారు. మూడు- ఎప్పటికీ కొత్తది నేర్చుకుంటూనే (చెక్కబడుతూనే) ఉంటారు. వాళ్ళ విద్య అనంతం. నాలుగు- వాళ్ళు ఏం చేసినా ప్రత్యేకంగా, ముచ్చటగా, అందరూ మెచ్చుకునేదిలా ఉంటుంది. ఐదు- అతి ముఖ్యమైనది- వాళ్ళ అంతరంగం కల్మషం లేకుండా ఉంటుంది. ఇంకా ఈ ప్రపంచపు ఈర్ష్యాద్వేషాలు వాళ్ళకి అంటుపట్టవు' అన్నాడు.

ఎప్పుడయితే కల్మషం అంటుపడ్తుందో, పెన్సిలుతో రాయటమంటే నామోషీగా భావిస్తాము.

## ఇచ్చుటలోనే ఉంది ఆనందం

**మద్దూరి రాజ్యశ్రీ**

పూర్వం ఎవరికన్నా రక్తం ఎక్కించాలంటే ఇప్పటిలా బ్లడ్‌బ్యాంక్‌లు లేవు ఊర్నిండా! వాళ్ళ చుట్టాల్లో ఎవరిదో రక్తం ఎక్కించేవారు. అలాంటి పరిస్థితుల్లో ఒక పాపకి ఉన్న ఫళంగా రక్తం ఎక్కించాల్సి వచ్చింది. తల్లిదీ, తండ్రిదీ ఎవరిదీ ఆ అమ్మాయి రక్తానికి సరిపోలేదు. పన్నెండేళ్ళ అన్న ఒక్కడే మిగిలాడు.

డాక్టర్ ఆ బాబుని సమీపించి, 'ఏం బాబూ! నీ రక్తం ఇస్తావా? మీ చెల్లి చావుబ్రతుకుల్లో ఉంది!' అన్నాడు.

ఆ బాబు ఒక్క నిముషం ఏవో తర్జనభర్జనలు తనలో తనే పడ్డాడు. తర్వాత కన్నీళ్ళపర్యంతంగా 'సరే! తీసుకోండి డాక్టర్,' అన్నాడు. 'చెల్లెలి మీద ఎంత ప్రేమో! ఏడ్చేస్తున్నాడు,' అనుకున్నాడు డాక్టర్. కానీ కబుర్లు చెప్పేందుకు అట్టే సమయం లేదు. హడావిడిగా పని కానిచ్చాడు. చెల్లెలు కుదుటపడిందని తెలిశాక, ఆ బాబు డాక్టర్‌ని అడిగాడు, 'డాక్టర్! ఇప్పుడు చెప్పండి, నేను ఎప్పుడు చనిపోతానో?'

డాక్టర్ ఆశ్చర్యపోయాడు ఆ ప్రశ్న విని– 'నువ్వెందుకు చనిపోతావు?' అంటే 'మరి నేను రక్తం ఇచ్చాను కదా! అందుకు.' అప్పుడర్థమైంది డాక్టర్‌కి అతను వెంటనే సరేననకుండా ఎందుకు ఒక నిముషం ఆలోచించాడో! అతను పోతాడేమోననుకుని కూడా తన జీవితాన్ని ఫణంగా పెట్టి చెల్లెలి జీవితం కాపాడాలనుకున్న అతని ఔదార్యానికి చేతులు జోడించకుండా ఉండలేకపోయాడు డాక్టర్.

డాక్టరే అంత మురిసిపోతే మనని సృష్టిచేసిన దేవుడెంత మురిసిపోతాడు? 'స్వంతలాభం కొంత మానుకు పొరుగువాడికి పాటుపడవోయ్,' అన్నారు. మనకి వీలున్న సాయం కూడా చేయం మనం. మంచి పథంలో నడవాలంటే ఇలా చిన్న చిన్న మంచి పనులు చేసి, నలుగురి మెప్పు పొందాలి.

## దేవుని మీద భరోసా!

**మద్దూరి రాజ్యశ్రీ**

ఒక కొత్తగా పెళ్ళయిన జంట ఓడలో ప్రయాణం చేస్తున్నారు. కత్తితో ఆపిల్‌పండ్లు కోసుకుతిన్నారు. వెళ్ళబోయే ఊర్లో చూడబోయే విశేషాలు తలుచుకున్నారు. ఇంక పడుకుందాం అనుకుంటుండగా తుఫాను మొదలయింది. ఆ బయట తుఫానుకి ఓడలో తుఫాను చెలరేగింది. అందరూ అల్లకల్లోలంగా పరుగులు తీస్తున్నారు. హాహాకారాలు చేస్తున్నారు. దేవుణ్ణి ప్రార్థిస్తున్నారు. కాని ఈ కొత్త జంటలోని అబ్బాయి మాత్రం నిశ్చింతగా ఉన్నాడు. భార్యకి ఆశ్చర్యం వేసింది. అందరూ ఇంత చిందులు తొక్కుతుంటే, ఇతనెలా నిశ్చింతగా ఉన్నాడా అని! అదే ప్రశ్న అతన్ని అడిగింది.

ఆ అబ్బాయి మారుమాట్లాడకుండా, అంతవరకూ వాళ్ళు ఆపిల్ కోసుకున్న కత్తి తీసి ఆ అమ్మాయి

మెడమీద పెట్టాడు చంపుతానన్నట్టుగా! ఆ అమ్మాయి చెక్కుచెదరలేదు. అదేదో సరసంలా చూస్తూ కూర్చుంది. 'ఏమీ అరవకుండా అలా ఎలా కూర్చున్నావ్?' అన్నాడు.

'ఎందుకు అరవటం! నన్ను కాపాడవలసిన నువ్వే నన్ను చంపటమా! అసాధ్యం! నాకు నీ మీద భరోసా ఉంది. అది లేకపోతే నిన్ను పెళ్ళి చేసుకునే దాన్ని కాదు. మా వాళ్ళని వదిలి నీతో ఇలా వంటరిగా వచ్చేదానిని కాదు,' అంది.

'నిన్న మొన్న పరిచయం అయిన నామీదే నీకంత భరోసా ఉంటే 28 ఏళ్ళుగా నేనడిగినవన్నీ ఇచ్చి, నన్ను కంటికి రెప్పలా కాపాడుకుంటున్న నా దేవుడి మీద నాకెంత భరోసా ఉండాలి? ఇట్లా నీతో పెళ్ళి చేసి అట్లా మనని చంపేస్తాడా? అందుకేనా పెళ్ళి చేసింది?'

అదీ నమ్మకం అంటే! దేవుడి మీద భారం వేస్తే ఉండే నిశ్చింత దేనికీ రాదు!

## చిట్టి చిట్టి బొమ్మలూ– చిన్నారీ బొమ్మలు

**మద్దూరి రాజ్యశ్రీ**

ఒకరోజు అనితా వాళ్ళింటికి ఒక చుట్టం వచ్చాడు. 'అనితా! మామయ్యకి నీళ్ళు ఇవ్వమ్మా!' అంది తల్లి.

బొమ్మలతో ఆడుకుంటున్న అనిత ఒక బొమ్మని చంకలో పెట్టుకుని ఒక చేత్తో నీళ్ళు తీసుకొచ్చింది. ఆ మామయ్య 'చాలా బాగుంది నీ బొమ్మ,' అని పలకరించాడు అనితని.

'లోపలికి రా మామయ్యా! నా దగ్గర బోలెడు బొమ్మలున్నాయి,' అని చెయ్యి పట్టి తన గదిలోకి లాక్కు వెళ్ళింది. నిజంగానే రకరకాల బొమ్మలున్నాయి. ఒకదాన్ని మించి ఒకటి పోటీ పడుతున్నాయి. ఒక బొమ్మ అయితే మనిషి రంగులో మెత్తగా, చాలా బాగుంది. దూరం నుంచి చూస్తే చంటి పాపాయి అనుకుంటారు.

'ఏమ్మా! నీకీ బొమ్మంటే చాలా యిష్టం కదూ!' అన్నాడు మామయ్య. 'ఊహూ! ఇదంటే ఇష్టం మామయ్యా,' అని ఇంకోటి తీసింది. అది ఒక కాలు విరిగిపోయి, మొహం నిండా గీతలు వచ్చేసి, చాలా పాతగా ఉంది.

'అదేమిటమ్మా అదంటే ఎందుకు ఇష్టం? ఇది చాలా బాగుంది కదా?' ఆశ్చర్యంగా అడిగాడు మామయ్య.

'ఈ బొమ్మని నీలా ఎవరూ చూసినా ముద్దు చేస్తారు. మెచ్చుకుంటారు. కాని ఈ కాలు విరిగిపోయిన బొమ్మని ఎవరూ పట్టించుకోరు! కంటితో కూడా చూడరు. నా బొమ్మని నేను పట్టించుకోకపోతే, ఇంకెవరు పట్టించుకుంటారు చెప్పు!' అంది.

'నా బొమ్మని నేను పట్టించుకోకపోతే, ఇంకెవరు పట్టించుకుంటారు చెప్పు?' ఆ ప్రశ్న వేసింది ఆ చిన్నారి కాదు.దేవుడు మనందరినీ నిలదీస్తున్నాడనుకోవాలి. బీదవాళ్ళని, కుంటివాళ్ళని, గుడ్డివాళ్ళని అసహ్యించుకుంటాం. చీదరించుకుంటాం! కాని దేవుడికి అందరూ తన పిల్లలే! అలాంటి పక్షపాత

వైఖరి చూపించదు.

కాకి మనకి ఏమి హాని చేసిందని దాని నలుపురంగుని బొంగురు గొంతుని అసహ్యించుకుని దూరంగా తరిమికొడతాం?

ఇలాంటి విగతజీవుల మీద జాలి చూపించగలిగితే క్రమేపీ మన ప్రేమ అనంతాకాశమంత అవుతుంది.

## చక్కని శరీరమా- జీవం లేని చొక్కానా?

**మద్దూరి రాజ్యశ్రీ**

ఒక ఊర్లో జాతర జరుగుతోంది. ఇసకేస్తే రాలనంతమంది వచ్చారు. తన నాలుగేళ్ళ పిల్లాడిని తీసుకుని ఒక తండ్రి కూడా వచ్చాడు. ఎక్కడ బాబు తప్పిపోతాడోనని తండ్రి బెంగ. ఎక్కడ తన కొత్త చొక్కా నలిగిపోతుందేమోనని బాబు బెంగ. ఇద్దరూ జాగ్రత్తగా ఒక్కొక్కటీ చూసుకుంటూ వస్తున్నారు.

ఇలా కొంత దూరం నడిచారో లేదో, ఎవరో చూసుకోకుండా వచ్చి బాబుని గుద్దారు. ఆ ఊపుకి తండ్రి చేయి నుంచి విడివడి, బాబు నేలమీద పడ్డాడు. మోచేయి గోక్కుపోయింది. చొక్కాకి మట్టి అంటింది. బాబు ఏడుపు లంకించుకున్నాడు!

'ఏడవకురా కన్నా! ఏమంత పెద్ద దెబ్బ తగిలిందని! రేపీపాటికి తగ్గిపోతుందిలే! ఇంకా లేచిన వేళ బాగుంది కాబట్టి చిన్న దెబ్బతో బయటపడ్డావు!'

ఇంకా ఏడుపాపలేదు బాబు. బుజ్జగించగా, బుజ్జగించగా ఎందుకేడుస్తున్నాడో చెప్పాడు. అతని ఏడుపు మోచేతికి దెబ్బ తగిలినందుకు కాదు,అపురూపంగా జాతర కోసం కొని వేసుకున్న కొత్త చొక్కా పాడయిందని. ఫెళ్ళున నవ్వాడు వాళ్ళ నాన్న.

'ఓరి నీ అసాధ్యం కూలా! ఇంతా చేసి బోడి చొక్కాకా ఏడుపు? ఇది పోతే నాలుగఖు చొక్కాలు కొనుక్కుంటావు. అదేం పెద్ద కష్టమని? అదే నీకు చెయ్యి విరిగుంటే నాలుగు చేతులు కొనుక్కోగలవా? ఒక్కసారి ఆలోచించు!' అన్నాడు.

టక్కున ఏడుపు ఆపేశాడు. అమ్మో చెయ్యి లేకుండా తిరగటమే. అందరూ ఏడిపించరూ? ఏడిపించటం మాట అలా ఉంచు. పనులు ఎలా చేసుకుంటాడు?

ఆ నాలుగేళ్ళ పిల్లాడికీ, మనకీ ఆట్టే తేడా లేదు. మనకి ఏదైనా రోగం వచ్చినా శరీరానికి దానంతట అదే బాగు చేసుకునే శక్తినిచ్చాడు భగవంతుడు. వస్తువులకా శక్తి లేదు. అలాంటిది మనం మన ప్రత్యేకత గుర్తించకుండా శరీరాన్ని బాధపట్టి అనవసరమైన వాటివెంట పరుగులు తీస్తున్నాము. ఎంత మాయలో పడిపోయామూ!

## నీడని చూసి దడుసుకోవద్దు

మద్దూరి రాజ్యశ్రీ

ఒక రాజుగారు పదివేల బంగారునాణేలు పెట్టి ఒక మేలుజాతి గుర్రాన్ని కొన్నాడు. చూడటానికి ఎంతో అందంగా ఉంది అది. కాని ఎవరు దగ్గరికొచ్చినా వాళ్ళని కసిరికొడుతోంది. ఎవరూ దానిమీదికెక్కే సాహసం చేయలేకపోయారు. రాజుకి ఇదొక సవాలు లాగా మిగిలిపోయింది. ఊర్లో ఒక దండోరా వేయించాడు.

'ఎవరైతే ఈ గుర్రాన్ని మచ్చిక చేసుకుని, దానిమీదకెక్కి, ఒక మైలు దూరం స్వారీ చేసి వస్తారో, వాళ్ళకొక పదివేల బంగారు నాణేలు ఇస్తా'నన్నాడు. డబ్బు కోసం ఆశపడి ఒకళ్ళిద్దరు వచ్చినా, దాని వాలకం చూసి, బెదిరిపోయి, పారిపోయారు. చివరికి ఒక నూనూగు మీసాల వాడు వచ్చాడు. ఎంతోమంది హేమాహేమీలు తిరిగివెళ్ళిపోతుంటే ఈ నవ యువకుడు ఏమి చేయగలడు? రాజుకు అతని మీద జాలేసింది. 'కావాలంటే నీకా బంగారు నాణాలు ఉత్తినే ఇస్తాను కాని నీ ప్రాణాన్ని ఫణంగా పెట్టకు,' అన్నాడు.

'లేదు మహారాజా! మీరు నా గురించి భయపడకండి! నాకేం కాదు,' అన్నాడు. అలాగే ఏం మంత్రం వేసాడో తెలీదు. దాన్ని మైలుదూరం స్వారీ చేసి తీసుకువచ్చాడు. అందరూ ఆశ్చర్యపోయారు. 'ఏం చేశావు బాబూ?' అంటే 'ఏం లేదు రాజా! దాని అవస్థేమిటో కనిపెట్టాను. దాని నీడని చూసి అది జంకుతోంది. అంతకు మించి బాధేమీ లేదు. అందుకే నేలమీద దాని నీడ పడకుండా ఉండేలాగా, అంటే సూర్యునికి అభిముఖంగా నడిపాను. అప్పుడు చక్కగా దౌడు తీసింది' అన్నాడు.

మన మనస్సూ అంతే! ఆ గుర్రం మనసులాంటిది. మన నీడను చూసి మనను భయపెడుతుంది. మాయా ప్రపంచం వెంట పరుగెత్తినన్నాళ్ళూ మనని చికాకుపరుస్తూనే ఉంటుంది. ఎప్పుడైతే ఆత్మజ్ఞానం కోసం ప్రయత్నించి, ఈ కనపడేదంతా మిథ్య అన్న విషయం గ్రహిస్తామో అప్పుడు ప్రశాంతమైన సరోవరంలాగా మనస్సు మారిపోతుంది.

## ఎవరికి అఖ్ఖరలేదు?

మద్దూరి రాజ్యశ్రీ

ఒకరోజు ఒక ధనికుడు తను కొత్తగా కొన్న కారు తీసుకుని, భార్యని తీసుకురావటానికి ఆవిడ ఆఫీసుకి వెళ్ళాడు. ఇంకా ఆవిడ ఆఫీసు వదలటానికి పది నిముషాల టైముంది. ఎంతన్నా కొత్త మోజు కదా! తళతళా మెరిసిపోతున్న కారుని మళ్ళీ ఒకసారి తుడిచాడు గుడ్డపెట్టి!

ఇంతలో అటుగా ఒక బిచ్చగాడు వచ్చాడు. మాసి, అలుగ్గుడ్డల్లా ఉన్న బట్టలు వేసుకున్నాడు. తైల సంస్కారం లేనట్టుంది. అతన్ని చూసి మొహం చిట్లించాడు ధనికుడు. తన కారు దగ్గరకి వస్తే తన కారెక్కడ పాడైపోతుందోనన్నట్టుగా! కాని ఆ బిచ్చగాడు కారు దగ్గరకి రాలేదు. ఇతనికి కొంచెం దూరంలో నిల్చున్నాడు.ధనికుడికి ఛాతీ గర్వంగా పొంగింది. 'థ్యాంక్స్' చెప్దామనుకుని

కూడా 'ఆ! వెర్రిమొహం! వాడికేం అర్థమవుతుంది! అనుకుని వదిలేశాడు.

డబ్బు కోసం పీడిస్తాడేమో ఎలా వదల్చుకోవాలా అని ఆలోచిస్తున్నవాడల్లా అతను ఎంతకీ డబ్బు అడుగకపోయేసరికి ఆశ్చర్యం వేసింది! 'ఎందుకు కోరి తంటాలు తెచ్చుకుంటావ్,' అని మనసు చివాట్లేస్తున్నా లెక్కచేయక, 'ఏమన్నా సాయం కావాలా?' అని అడిగాడు.

ఇదే అదను అని చెయ్యి చాస్తాడని, జేబులో చెయ్యి పెట్టబోయాడు. కాని ఆశ్చర్యం! చెయ్యి చాచకపోగా, 'ఎవరికి అఖ్ఖరలేదు సాయం?' అన్నాడు చిరునవ్వుతో. ఛెర్నాకోలుతో వీపు మీద కొట్టినట్టయింది ధనికుడికి. నిజమే! ఆ బిచ్చగాడికి ఏ పదిరూపాయలో సాయం కావాల్సి వస్తే తనకి పదిలక్షలు సాయం కావాల్సి వచ్చింది. బ్యాంకు సాయం చేయకపోతే తనకెక్కడిదీ కొత్త కారు? ఆ డబ్బు కోసం బ్యాంకు చుట్టూ ఎన్నిసార్లు తిరిగాడని?

'ఇతడు బిచ్చగాడా లేక దేవుడు తనకి సత్యం బోధించమని పంపిన వేదాంతా?' అని ఆశ్చర్యపోయాడు ధనికుడు. వెంటనే తన జేబులోంచి వందకాగితం తీసి ఇచ్చాడు.

'ఎవరికి అఖ్ఖరలేదు సాయం?' ఎంత సత్యం!

## మనకేం కావాలి?

**మద్దూరి రాజ్యశ్రీ**

అనగనగా ఒక ఊర్లో ఒక మధ్యతరగతి కుటుంబం ఉంది. వాళ్ళకి అపురూపంగా ఒక కూతురు. అందరి పిల్లల్లాగా ఆ అమ్మాయిని సిరిసంపదలతో తులతూగేలా చేయాలని వాళ్ళకి ఉంటుంది.కాని పరిస్థితులు అనుకూలించవు.

ఒకసారి ముగ్గురూ కలిసి సంతకెళితే అక్కడొక ముత్యాల గొలుసు చూసి మోజుపడుతుంది పాప. అది 500 రూపాయలు. అది తన తాహతుకి మించిందే అయినా పాప కోరిక కాదనలేక కొంటాడు. పాప కూడా ఆ నెల ఇంకేం కోరననీ, పండక్కి బట్టలు వద్దనీ మాట ఇస్తుంది. అలాగే పాప మాటకి కట్టుబడి ఉంటుంది.

వాళ్ళ నాన్నకి రోజూ రాత్రి పడుకునేటప్పుడు పాపకి కథ చెప్పటం అలవాటు. సుమారు ఒక నెల తర్వాత కథ చెప్పాక 'పాపా, నాకు నీ ముత్యాల గొలుసు ఇస్తావా?' అంటాడు. పాపకి నాన్నంటే ప్రాణం. కానీ ముత్యాల గొలుసు ఇంకా ప్రాణమై కూర్చుంది. అందుకే, 'ఏం అనుకోవద్దు నాన్నా, పోనీ అంతకు ముందు కొన్న బొమ్మ తీసుకో',' అంటుంది. తండ్రి ఏం అనలేదు. అలా నాలుగైదు సార్లు తండ్రి అడగటం, పాప యమధర్మరాజులాగా 'అదియును నీ పతి ప్రాణములు తప్ప' అని సావిత్రితో అన్నట్టుగా అది తప్ప ఏదో ఒకటి ఇస్తాననేది.

అలా ఆరు నెలలు గడిచాక, ఏమనుకుందో ఏమో తండ్రి అడక్కముందే, 'నాన్నా ఇదుగో!' అని ముత్యాల గొలుసు ఇస్తుంది. అప్పటికి ధైర్యం కూడదీసుకుందన్నమాట ఇవ్వటానికి! అంతేకాని మోజు తీరి ఇవ్వలేదు.వెంటనే తండ్రి తన జేబులోంచి ఒక పొట్లం తీసిస్తాడు. ఏమిటనుకున్నారు

అది? 5000 రూపాయలు ఖరీదు చేసే ముత్యాలహారం! అనుకోకుండా అతనికి బోనస్ వస్తే కూతురికి కొని ఉంచుతాడు. ఎప్పుడది ఇస్తే ఈ కొత్తది అప్పుడిద్దామని!

మన విషయంలో దేవుడూ అదే చేస్తాడు. మనం చిన్న చిన్న విషయాల కోసం పరుగు తీసినన్నాళ్ళూ ఆయన ఇవ్వాలనుకున్న పెద్ద విలువైనది ఇవ్వడు. ఎప్పుడైతే ఇవి వదులుతామో అప్పుడు అవి వస్తాయి! డబ్బు కూడా అంతే! మనం దాని వెంట పరుగెత్తినన్నాళ్ళూ రాదు! వద్దంటే మాత్రం వళ్ళో వచ్చి పడ్తుంది.

## కోరవలసిన పెన్నిధి

**మద్దూరి రాజ్యశ్రీ**

ఒక రాజుగారికి అనేకమంది భార్యలు. బోలెడు పరివారం ఉన్నారు. ఒకసారి ఆయన దూరదేశాలు వెళ్తున్నాడు. తిరిగి రావటానికి కొన్నినెలలు పడుతుందన్నారు పెద్దలు. అప్పుడు రాజుగారు అందరి భార్యల దగ్గర వీడ్కోలు తీసుకొని, వాళ్ళకేం కావాలో కోరుకోమన్నారు. ఒక్కొక్కళ్ళు ఇదే అదనని బోలెడు చీని చీనాంబరాలు, ధనకనకవస్తు వాహనాలు పోటానుపోటీగా కోరారు.

ఒక్కరాణి మాత్రం '1' నంబరు వేసి పంపింది. రాజుకి ఈ పరిభాషేమిటో అర్థం కాలేదు. మంత్రిని పిలిచి అడిగాడు. మంత్రికి ఆ రాణి పతిభక్తి గురించి, ఆవిడ తెలివితేటల గురించి ముందే తెలుసు. అందుకే వెంటనే, 'రాజా ఆవిడకి మీరే కావాలిట' అన్నాడు.

'అదెలా?'

'నెంబర్ వన్,' అంటే అగ్రస్థానంలో ఉన్నవాడు. అది మీరే! మీరు రాజుగా అగ్రస్థానంలో ఉన్నారు. భర్తగా ఆవిడ హృదయంలో అగ్రస్థానంలో ఉన్నారు. అందుకని మీరు తప్ప మీ కానుకలేం వద్దని అన్యాపదేశంగా తెలిపింది. పైగా మీరే దగ్గరలేకపోయాక మీరు పంపే కానుకలు అలంకరించుకుని ఎవరికి చూపుతుంది? మీరు లేకపోతే అంతా శూన్యమే!'

రాజు కదిలిపోయాడు ఆ ఆప్యాయతకి. తనని అందరూ దేనికో దానికి అర్థించటమే తెలుసు. కేవలం తనని కోరుకున్న వాళ్ళెవరూ లేరు. తన తక్కిన రాణులు కోరిన వస్తువులు తేవటానికి మనుష్యులను పంపి తన రాణి దగ్గరకు తాను వెళ్ళిపోయాడు. తన ఆనందం వెలిబుచ్చి, ఆమె దగ్గరే ఉండిపోయాడు. రాజు ఎక్కడ ఉంటే, అక్కడే ఆయన పరివారం, ఆయన అధికారం కూడా ఉంటాయి కదా! అడక్కుండానే కోరికలూ తీరుస్తాడు. అదే దేవుడే మన గుండెలో కొలువుండాలని కోరితే అడగకుండానే మన కోరికలూ తీరుస్తాడు. మనని కంటికి రెప్పలా కాపాడుతాడు. మహాభారతంలో కృష్ణుడి పరివారాన్ని కోరిన దుర్యోధనుడి గతి ఏమయిందో, కృష్ణుడు మాత్రమే చాలనుకున్న అర్జునునికి ఎంత మేలయిందో తెలిసిందే కదా!

## పరిపూర్ణ అవగాహన

**మద్దూరి రాజ్యశ్రీ**

ఒక మంచు పడే ప్రదేశంలో ఒక తండ్రికి నలుగురు కొడుకులున్నారు. వారు కొంచెం దుడుకు స్వభావం కల వాళ్ళు. వాళ్ళ దుడుకుతనం తగ్గించాలని ఆ తండ్రి ఒక ఆలోచన చేశాడు. నలుగురు కొడుకులనీ నాలుగు కాలాలలో వెళ్ళి ఒక చెట్టుని పరిశీలించి రమ్మన్నాడు. నలుగురూ చూసాక, ఒక రోజు అందరినీ తన చుట్టూ కూర్చోబెట్టుకుని 'ఇప్పుడు చెప్పండి మీ అనుభవాలు' అన్నాడు.

పెద్ద కొడుకు చలికాలంలో చూశాడు. 'ఏం ఉంది నాన్నా చెప్పేందుకు! అంతా తెల్లటి మంచుతో కప్పబడి ఉంది! ఒక అందమా, పాడా,' అన్నాడు.

రెండో కొడుకు వసంతకాలంలో చూశాడు. 'అదేం కాదు నాన్నా! ఎంత బాగుందో! లేత చిగుళ్ళు తొడుగుతున్నాయి. లేత ఆకులు, రంగురంగుల పక్షులతో చూడముచ్చటగా ఉంది నాన్నా!' అన్నాడు.

మూడో కొడుకు ఎండాకాలంలో చూశాడు. 'చెట్టు నిండా పండ్లతో భలే నోరూరించేలాగా ఉంది. పండ్ల భారానికి కిందికి వంగింది,' అన్నాడు.

నాలుగో కొడుకు ఆకురాలు కాలంలో చూశాడు. 'ఏమి అందం? అన్న చెప్పేది అబద్ధం! ఒక్క పండు లేదు సరికదా ఒక్క ఆకు కూడా లేదు. చెట్టంతా బోసిగా, శూన్యంగా ఉంది,' అన్నాడు.

'అబ్బాయిలూ, మీరు నలుగురూ కరక్టే! ఒకే చెట్టు ఒకొక్క కాలంలో ఒకొక్కరకంగా ఉంటుంది. మీరు ఒక్క కాలంలోనే చూసి దానిమీద మీకు తోచిన నిర్ణయానికొచ్చేసారు. అది చాలా తప్పు. అలాగే మనుష్యులని కూడా ఒక్క సంఘటనని చూసి బేరీజు వేసేయకూడదు.

చెట్టుని చలికాలంలో మాత్రమే చూస్తే దాని లేత చిగురు, దాని పండ్లు చూసే అవకాశం పోగొట్టుకుంటారు. అలాగే జీవితంలో ఒక చెడు సంఘటనతో క్రుంగిపోయి, నిరాశా నిస్పృహలతో నిండిపోతే ఆ తర్వాత రాబోయే మంచి సంఘటనలను ఆస్వాదించలేరు. 'ఇఫ్ వింటర్ కమ్స్ కెన్ స్ప్రింగ్ బి ఫార్ బిహైండ్' అన్నాడు ఇంగ్లీషు కవి. ఇప్పుడు కష్టాలు వస్తే, సుఖాలు వెన్నంటే రావా?

## శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదా?

**మద్దూరి రాజ్యశ్రీ**

తెలుగు క్లాసు జోరుగా జరుగుతోంది. మాస్టారు దేవుడి లీలలు గురించి ఏదో చెప్తున్నాడు. ఒక చాకులాంటి కుర్రాడు మధ్యలో లేచి, 'మాస్టారూ నాకో ధర్మ సందేహం' అన్నాడు.

పాఠం మధ్యలో ఎందుకు లేచావు అని కసురుకోకుండా 'ఏమిటి చెప్పు?' అన్నారు.

'ఏం లేదు మాస్టారూ! ఒక పక్కేమో శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదంటారు. ఇంకోపక్కేమో 'నీ కర్మకు నీవే బాధ్యుడివంటారు. రెండూ ఒకదానికొకటి వ్యతిరేక పదాలుగా లేవా? మీ మామయ్యనడిగితే ఒకటి భక్తియోగంలోనూ, ఇంకోటి జ్ఞానయోగంలోనూ వస్తుంది పోరా అని ఏమిటేమిటో చెప్పాడు.

నాకేం అర్థం కాలేదు' అన్నాడు.

'మంచి ప్రశ్నవేశావు నాయనా! రెండూ భక్తియోగం లోనివే! నీకు చిన్న అంశంలో చెప్పాలంటే ఒక రకంగా చెప్పవచ్చు. ఉదాహరణకు నువ్వు ప్రసాదంగా వచ్చి, గులాబ్‌జామ్ చేద్దామనుకున్నావనుకో! మధ్యలో ఏదో ఆటంకం వచ్చి, నువ్వు సరిగ్గా చేయక అవి నల్లగా మాడాయనుకో! నువ్వు చెప్పిన రెండింటిలో మొదటి సిద్ధాంతం – 'శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు' అన్నదాని మీద గనుక నమ్మకం ఉంటే 'నేను గులాబ్‌జామ్ చేద్దామనుకున్నాను. కాని దేవుడు కాలా జామూన్ కావాలనుకున్నాడు. అందుకని ఇవే పెట్టాను' అంటావు. అదే సన్నివేశం. కాని నువ్వు రెండో సిద్ధాంతం అంటే 'నీ కర్మకు నీవే బాధ్యుడివి' గనుక నమ్మితే 'అయ్యో గులాబ్ జామ్ చేద్దామనుకున్నాను, కాని నల్లగా మాడిపోయింది. ఎంత అశ్రద్ధ అయిపోయింది,' అని రోజంతా బాధపడతావు. ఇది నీ మనస్థత్వం బట్టి ఉంటుంది. ఇది మొదటి మెట్టు.

'ఇంత మీమాంస చేసావు కాబట్టి దీనికి రెండో మెట్టు కూడా చెప్తాను. ఉదాహరణకు మీరు రాసే పరీక్షలు తీసుకోండి. మేం మీరు రాస్తుంటే చూస్తుంటాం. మా పరిధిలో ఉన్న పనులు మేం చేస్తాం. అంటే మీకు పేపర్లు ఇవ్వటం, దారాలు ఇవ్వటం. మాట్లాడవద్దని చెప్పటం వగైరా! అంతవరకే మాకు అధికారం ఉంది. మీలో ఎవరైనా కాపీ కొడ్తున్నారనుకో, మీ పేపరు లాగేసుకుని, మిమ్మల్ని పరీక్ష మధ్యలోంచి ఇంటికి పంపే అధికారం మాకు లేదు. అక్కడ శివుడు (అంటే ఇక్కడ ప్రిన్సిపాల్) రావాలన్నమాట. అతని మీద చర్య తీసుకునేది ఆయన.